
సాక్షి
ఒడిశా

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించింది. ఇందులో నగదు రూ.4,10,963లు, బంగారం 5 గ్రాములు, వెండి 600మిల్లీగ్రాములు వచ్చాయి.



తెలుగు భాషాభివృద్ధికి కృషి
జయపురం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. - 8లో



నీలమ్మ ఉత్సవాలు ప్రారంభం
పర్లాకిమిడిలో నీలమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - 8లో

న్యూస్‌రీల్‌

డ్రైవర్‌కు గుండెపోటు!

• అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లిన బస్‌



గొడపాదర్‌ వద్ద గుంతలోకి వెళ్లిన బస్సు

కొరాపుట్‌: ప్రభుత్వ లక్ష్మీ బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మంగళవారం కొరాపుట్‌ జిల్లా గొడపాదర్‌ వద్ద చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు జయపూర్‌ వైపు వెళ్తుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదళ పంచాయతీలోని నువాపడ గ్రామానికి చెందిన విలాస్‌ కొరకొరియా ఇంట్లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో లక్షలాది రూపాయల విలువైన టీవీ, ఫ్రిడ్జ్‌, బీరువ తదితర వస్తువులు దగ్ధమయ్యాయి. కుటుంబంతో కలిసి విలాస్‌ సోమవారం తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. అయితే ఇంట్లో దట్టమైన పొగ బయటకు వస్తుండటంతో ఇరుగుపొరుగు వారు చూసి అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. అయితే సిబ్బంది వచ్చేసమయానికే గృహోపకరణాలన్నీ బూడిదయ్యాయి. విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా ప్రమాదం సంభవించి ఉండవచ్చునని భావిస్తున్నారు.

అంబొదళలో జగన్నాథుని విగ్రహ ప్రతిష్ట



కొత్తగా రూపొదించిన జగన్నాథుని విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదళలో జగన్నాథ మందిరంలో జగన్నాథుని కొత్త విగ్రహ ప్రతిష్టోత్సవాలు సోమ,మంగళ వారాల్లో అత్యంత వైభవంగా జరిగాయి. సంప్రదాయ పద్ధతిలో స్వామి వారి పూజా కార్యక్రమాలను నిర్వహించి జగన్నాథుని కొత్తగా రూపొందించిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. జగన్నాథ మందిరం నిర్వాహక కమిటీ అధ్యక్షులు చంద్రశేఖర్‌ జోషి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. విగ్రహ ప్రతిష్టోత్సవాలకు పరిసర ప్రాంతాలకు చెందిన వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రెండు నెలల కిందట స్వామి విగ్రహం కాలిపోగా.. కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్‌ జిల్లా ధమంజోడిలో పది రోజులు నిర్వహించిన పంచపటమాలి 19వ రాష్ట్రస్థాయి నాటక పోటీలు మంగళవారంతో ముగిశాయి. నాటక పోటీలలో జయపురం కళాకారులు 'జీవన ఎకో నాటక(జీవితం ఒక నాటకం)'అనే నాటకాన్ని ప్రదర్శించి పలు బహుమతులు అందుకున్నారు. నాటక రచయిత జగదీస్‌ అధికారి, అభినేత్రి విజయలక్ష్మీ పాణిగ్రహి, నటులు బిఘ్నురాజ్‌ ఆచార్య, బాలనటుడు నివేదన పాణిగ్రహి, ముఖ్యఅతిథి నటులు నిరంజన్‌ సామల్‌లను ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించి గౌరవించారు. ఈ నాటకానికి నిరంజన్‌ పాణిగ్రహి దర్శకత్వం వహించగా జి.మహేష్‌ సంగీతం సమకూర్చారు.

మీనాజోలను తీర్థస్థలంగా మారుస్తాం

• రాష్ట్ర రవాణా, గనుల శాఖ మంత్రి బిభూతి జెన్న



కేదార్‌నాథ్‌ నుంచి తీసుకువచ్చిన స్పటిక లింగం ప్రాణప్రతిష్ట



వేదికపై మంత్రి జెన్న, గోపి ఆనంద్‌, బాలకృష్ణ పండ, కొండబాబు తదితరులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌ సమితిలో పులాపాలియా, వంశధార, చవులధువా నదుల కలిసే త్రివేణి సంగమంగా గుర్తింపు పొందిన మీనాజోల ప్రాంతాన్ని తీర్థ స్థలిగా గుర్తించడంతో పాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం యోచిస్తుందని రాష్ట్ర రవాణా, గనుల శాఖ మంత్రి బిభూతి జెన్న అన్నారు. సోమవారం నాడు మీనాజోలలో కొత్తగా నిర్మించిన మీనకేతనేశ్వర్‌ మందిరం ప్రారంభోత్సవంతో పాటు ప్రముఖ పుణ్య క్షేత్రం కేదార్‌నాథ్‌ నుంచి తీసుకువచ్చిన స్పటిక లింగం ప్రాణ ప్రతిష్టోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మందిరం, లింగం ప్రతిష్టోత్సవాల్లో పాల్గొన్న మంత్రి జెన్న అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. రాష్ట్రంలో గల పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో మీనాజోల ప్రాంతాన్ని పర్యాటక స్థలంగా గుర్తించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని అన్నారు. మూడు నదుల సంగమంగా గుర్తింపు పొందిన మీనాజోలలో ఏటా శివ రాత్రి నాడు ఈ ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతుందని అన్నారు.

ఇంతటి ప్రాధాన్యత గల ఈ ప్రాంతానికి పర్యాటక స్థలంగా గుర్తింపు దక్కితే ఇక్కడ కొలువై యున్న మీనకేతనేశ్వర్‌ మందిరం కూడా పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందుతుందని అభిప్రాయపడ్డారు. పర్యటకులకు, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించే విధంగా ఈ ప్రాంతాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మీనాజోల ఆధ్యాత్మిక కమిటీ అధ్యక్షుడు బాలకృష్ణ పండ నేతృత్వంలో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తే మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి జెన్న అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి ఆనంద్‌, బీజేపీ సీనియర్‌ నాయకుడు శివకుమార్‌ పట్నాయక్‌, యాల్ల కొండబాబు, కాశీరాం మాఝి తదితర ప్రముఖులు హాజరయ్యారు. అంతకు ముందు పద్మపూర్‌ సమీపంలో గల ముచికిపాదొరా కూడలిలో మంత్రికి యాల్ల కొండబాబు అతని మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాగతం పలికారు.



సభకు హాజరైన జనం

జూన్‌ 27న రథయాత్ర



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

• 25 మందికే రథంపైకి అనుమతి
• కమిటీ నిర్ణయం

జయపురం/కొరాపుట్‌: జయపురంలో జూన్‌ 27న జరగనున్న ప్రసిద్ధ జగన్నాథస్వామి రథాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. రథాయాత్ర నిర్వహణపై సోమవారం సాయంత్రం స్థానిక మున్సిపాలిటీ కౌన్సిల్‌ సభాగృహంలో కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించింది. రథాయాత్రలో సేవాయత్‌లు రథం పైకి మొబైల్‌ ఫోన్లు తీసుకొని వెళ్లకూడదని, అలాగే రథంపైకి 25 మంది కంటే ఎక్కువమంది సేవాయిత్‌లను అనుమతించ కూడదని తీర్మానించారు. అలాగే 18 ఏళ్లలోపు సేవాయత్తులను రథం పైకి అనుమతించ కూడదని, ఏ సేవాయిత్‌ అయినా మద్యం సేవించి రథంపైకి వెళ్లినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా అటువంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సేవకులకు గుర్తింపు కార్డులు సమకూర్చాలని నిర్ణయించారు. రథం లాగేవారు మద్యం సేవించకూడదని అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని సమాశేశం స్పష్టం చేసింది. జయపురం సబ్‌కలెక్టర్‌, సబ్‌డివిజన్‌ దేవదాయ అధికారిణి అక్కవరమ్‌ శౌశ్య రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి మాట్లాడుతూ.. రథాయాత్ర ప్రశాంతంగా శాంతిభద్రతల నడుమ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని, పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. రథిపాడియ నుంచి గుండిచా మండపం (బంకమఠం) వరకు ప్రతి కూడలి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఇంజినీర్‌ ప్రియరంజన్‌ బెహర, పోలీసు అధికారులు జచంద్రప్రధాన్‌, మణిష సాహు, ఏడీపీవో యశోద గదబ పాల్గొన్నారు.

స్వాభిమాన్‌ ఏరియాలో కలెక్టర్‌ పర్యటన



జోడాంబోలో పసుపు పంటను పరిశీలిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్‌ ఏరియాలో మంగళవారం కలెక్టర్‌ ఆశీష్‌ ఈశ్వర్‌ పటేల్‌, ఎస్పీ వినోద్‌కుమార్‌ పటేల్‌ పర్యటించారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో మావోల అలజడి ఎక్కువగా ఉండేది. ఆ సమయంలో గిరిజనులు ఎక్కువగా గంజాయి సాగు చేసేవారు. ఇప్పుడు బీఎస్‌ఎఫ్‌ జవాన్ల రాకతో మావోలు తగ్గిపోయారు. గిరిజనుల్లోనూ చైతన్యం వచ్చింది. ఈ సందర్భంగా గిరిజనులతో చర్చించిన కలెక్టర్‌ ఆశీష్‌ ఈశ్వర్‌ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేతు యోజన పథకంలో ఈ ప్రాంతంలో గిరిజనుల ఉపాధి కోసం గాను పసుపు, చోడి, అల్లం తదితర పంటలు పండించుకునేందుకు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా ఆరా తీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శించారు.

ఘనంగా సుదర్శన హోమం



లక్ష్మీ నృసింహుని ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రాయగడ: కొలనార సమితి అమలాభట్ట వద్ద గల శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఉన్న శ్రీలక్ష్మీనృసింహుని మందిరంలో మంగళవారం నుంచి చందనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్‌ ఆచార్యులు, స్థానిక బాలాజీ నగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర మందిరానికి చెందిన ప్రధాన అర్చకులు రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహ స్వామికి ఉదయం ఆరాధన, చందనాభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు సుదర్శన హోమం నిర్వహించారు. బుధవారం సాయంత్రం స్వామి కల్యాణోత్సవాలు అత్యంత ఘనంగా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్‌ తెలియజేశారు.

రోహింగ్యాలపై ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న చాంబర్‌ ప్రతినిధులు

కొరాపుట్‌: బంగ్లాదేశ్‌ నుంచి వచ్చిన రోహింగ్యాలపై నబరంగ్‌పూర్‌ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ పిర్యాదు చేసింది. మంగళవారం చాంబర్‌ ప్రతినిధులు ఎస్పీ మిహిర్‌ పండాను అతని కార్యాలయంలో కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. తాము కష్టపడి టాక్స్‌లు, విద్యుత్‌ బిల్లులు, కార్మికులకు వేతనాలు, సామాజిక కార్యక్రమాలకు విరాళాలు ఇస్తున్నామన్నారు. సామాజిక అభివృద్ధిలో ఎన్నో వ్యయప్రయాసలు పడి భాగస్వామ్యం అయ్యామన్నారు. కానీ ఎటువంటి అనుమతులు లేకుండా బంగ్లాదేశ్‌ నుంచి రోహింగ్యాలు వచ్చి ఈ ప్రాంతంలో బైక్‌ల మీద గ్రామాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. వారికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. వారి పూర్వ చరిత్ర కూడా ఎవరికీ తెలియదన్నారు. వీరి వలన సమాజంలో అసాంఘీక సమస్యలు ఏర్పడతాయన్నారు. ఎస్పీని కలిసిన వారిలో చాంబర్‌ ప్రెసిడెంట్‌ కను దాస్‌, సభ్యులు పి.ఎల్‌.మూర్తి, వి.మహేష్‌, రాకేష్‌ గుప్తా, తదితరులు ఉన్నారు.

పహల్గామ్‌ ఉగ్రవాద దాడిపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశం

• కాంగ్రెస్‌ ప్రతిపాదన

భువనేశ్వర్‌: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్‌ శాసన సభా పక్షం (సీఎల్‌పీ) నాయకుడు రామ చంద్ర కదమ్‌ ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝిని లిఖితపూర్వకంగా ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి మోహన్‌ చరణ్‌ మాఝిని ఉద్దేశించి రాసిన అధికారిక లేఖలో సీఎల్‌పీ నాయకుడు ఈ విషాద సంఘటనపై తన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేశారు. ఇది దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి తీవ్రతను ఉద్ఘాటిస్తూ శాసన సభ్యులు తమ సంతాపాన్ని తెలియజేయడానికి, మృతుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించడానికి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శక్తివంతమైన సందేశాన్ని పంపడానికి వీలుగా అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రామ చంద్ర కదమ్‌ పిలుపునిచ్చారు. ఈ విషాదకర సమయంలో శాసన సభ ప్రత్యేక సమావేశాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. దీని వల్ల సభ్యులందరూ తమ సంతాపాన్ని తెలియజేయడానికి, బాధితులు, వారి కుటుంబాలతో ఐక్యంగా నిలబడటానికి, ఉగ్రవాదంపై పోరాటానికి ఎటువంటి రాజకీయ విభజనలు లేవని నిరూపించడానికి వీలు కలుగుతుందని వివరించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి తక్షణ పరిశీలనను ఈ లేఖలో రామ చంద్ర కదమ్‌ అభ్యర్థించారు.

తీర ప్రాంతంలో భద్రత పెంపు



మెరైన్‌ థాణా పోలీసుల పహారా

భువనేశ్వర్‌: పహల్గామ్‌ ఉగ్రవాద దాడి నేపథ్యంలో రాష్ట్రంలో తీరప్రాంత భద్రతను కట్టుదిట్టం చేశారు. దేవీ నది ముఖద్వారం వెంబడి అస్తరంగ్‌ మెరైన్‌ పోలీసు దళాలు నావికా దళ అధికారులు, మెరైన్‌ పోలీసుల సంయుక్త బృందంతో పహారా నిర్వహించారు. నదిలో మత్స్యకారుల గుర్తింపును పహారా బృందం తనిఖీ చేస్తోంది. ఈ ప్రాంతంలో ఏదైనా అనుమానాస్పద కదలిక లేదా తెలియని వ్యక్తి సంచరిస్తే వారికి తెలియజేయాలని స్థానికుల్ని కోరారు. మత్స్యకారులు చేపలు పట్టడానికి వెళ్లే ప్రతిసారీ ఆధార్‌ కార్డులను తమ వెంట తీసుకెళ్లాలని పోలీసు అధికారులు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా వారి మెరైన్‌ కార్డులు, వారి ఓటరు గుర్తింపు కార్డులను కూడా అడగాలని పోలీసు అధికారులు మత్స్యకారులకు సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు జరిగితే సంప్రదించగల ఫోన్‌ నంబర్‌ను కూడా అధికారులు మత్స్యకారులకు అందజేశారు. పహల్గామ్‌ ఉగ్రవాద దాడి తర్వాత దేవి నది ముఖద్వారం వద్ద భద్రతను పెంచారు. ఏదైనా చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరిగినట్లు అనుమానం వస్తే తక్షణమే తెలియజేయాలని మత్స్యకారులను ఆదేశించినట్లు ఒక అధికారి తెలిపారు.

మే 20 నుంచి రబీ ధాన్యం సేకరణ



ధాన్యం సేకరణ సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్‌ పట్వారి, వేదికపై ఎమ్మెల్యే హికక, ఎంపీ సప్తగిరి

రాయగడ: రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని జిల్లా యంత్రాంగం మే 20 నుంచి సేకరిస్తుందని కలెక్టర్‌ ఫరూల్‌ పట్వారి అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో జరిగిన సమీక్షసమావేశంలో ఆమె ప్రసంగించారు. ఈ ఏడాది జిల్లాలో 8,890 క్వింటాళ్ల ధాన్యం సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందుకోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మండీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణతో పాటు బజారు నియంత్రణ కమిటీ (ఆర్‌ఎంసి) అధికారులు మండీల ఏర్పాటుకు సంబంధించి అన్ని సన్నాహాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి రైతు నుంచి ధాన్యం సేకరించాలని ధాన్యం సేకరణలో భాగంగా ఏర్పాటు చేసిన మండీల్లో రైతులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొనకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బిష్ణు ప్రసాద్‌ కర్‌ మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో ధాన్యం విక్రయాలకు సంబంధించి ఇప్పటి వరకు 503 మంది రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు వివరించారు. ధాన్యం క్వింటాల్‌ మద్దతు ధర రూ.2300 ప్రభుత్వం ప్రకటించగా ఇన్‌పుట్‌ సహాయం కింద రైతులు ప్రతి క్వింటాల్‌కు అదనంగా మరో రూ.800 పొందగలరని అన్నారు. జిల్లాలోని బిసంకటక్‌, మునిగుడ, గుడారి, పద్మపూర్‌ ,రామనగుడ, కొలనార సమితుల్లో మే 20 నుంచి ధాన్యం మండీలు ప్రారంభమవ్వగా గుణుపూర్‌లో మే 28 నుంచి ప్రారంభమవుతాయని అన్నారు. ఈ సమావేశంలొ రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రక, కొరాపుట్‌ ఎంపీ సప్తగిరి శంకర్‌ ఉల్క, బిసంకటక్‌ ఎమ్మెల్యే నీలమాధవ హికక జిల్లా స్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌ పెన్షనర్ల ఆందోళన



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్లు

రాయగడ: స్థానిక జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఎదుట మంగళవారం ఈపీఎఫ్‌ పెన్షనర్లు ఆందోళన చేశారు. ఈ మేరకు తమ సమస్యలకు సంబంధించి ప్రధాన మంత్రి పేరిట ఒక వినతి పత్రంను జిల్లా డిప్యూటీ కలెక్టర్‌కు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం తమకు కనీసం రూ.9 వేల పెన్షన్‌ మంజూరు చేయడంతో పాటు డీఏ, డీఏలు అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు. ఈపీఎఫ్‌ పెన్షన్‌దారులకు మెడికల్‌ అలోవెన్స్‌లు అందించాలని, అలాగే అయుష్మాన్‌ భారత్‌ యోజన పథకంలో తమను చేర్పించాలని కోరారు.



కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

వడగాడ్పులపై ఆరోగ్య శాఖ సమగ్ర సన్నాహాలు



డాక్టర్‌ నీలకంఠ మిశ్రా అధ్యక్షతన వడగాడ్పుల సమీక్ష సమావేశం

భువనేశ్వర్‌: రాష్ట్రంలో వేసవి తాపం విపరీతంగా పెరుగుతోంది. తెల్లారితే గడప దాటడం కష్టతరమవుతోంది. ఈ నేపథ్యంలో వడగాడ్పుల ప్రభావంతో వడదెబ్బ ప్రమాదాల తీవ్రత పట్ల రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అప్రమత్తమైంది. వడగాడ్పుల సమర్థమైన నిర్వహణతో అవాంఛనీయ సంఘటనల నివారణకు విభాగం ప్రాధాన్యత కల్పించింది. ఆరోగ్య శాఖాపరమైన ఏర్పాట్లతో సాధారణ ప్రజానీకంలో అవగాహన పెంపొందించాలనే దృక్పథంతో పరిస్థితుల్ని సమీక్షించారు.

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్‌ ముఖేష్‌ మహాలింగ్‌ ఆదేశాల మేరకు వడగాడ్పుల నిర్వహణతో వడదెబ్బ ప్రమాదాల నివారణ కోసం అవసరమైన కార్యాచరణ, అనుబంధ ఏర్పాట్లు క్రమబద్ధీకరణకు ప్రజారోగ్య (డీపీహెచ్‌) డైరెక్టర్‌ డాక్టర్‌ నీలకంఠ మిశ్రా అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. వడ గాలుల ప్రభావాలను తగ్గించడానికి ఇంట్రావీనస్‌ ద్రవాలు, ఓరల్‌ రీహైడ్రేషన్‌ సొల్యూషన్స్‌ (ఓఆర్‌ఎస్‌), మందులు, ఎయిర్‌ కూలర్లు, పవర్‌ బ్యాకప్‌ వ్యవస్థలు వంటి అవసరమైన వైద్య సామగ్రి నిరంతర లభ్యతను నిర్ధారించడానికి శాఖ కృషి చేస్తోందని తెలిపారు. వడదెబ్బ సంబంధిత బాధితుల సత్వర చికిత్స, వైద్యం కోసం ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో తగినన్ని పడకలు ముందస్తుగా సిద్ధం చేయాలని రాష్ట్రంలో 30 జిల్లాలకు ఆదేశాలు జారీ చేశారు. వడగాడ్పుల నిర్వహణపై దృష్టి సారించి సంబంధిత అనారోగ్యాలను నిర్వహించడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ఈ కార్యాచరణ కోసం ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలకు ఆరోగ్య శాఖ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ శిక్షణలో ఆరోగ్య సంరక్షణ నిపుణులు మాత్రమే కాకుండా, స్థానిక ఆరోగ్య కార్యకర్తలు, సాధారణ ప్రజానీకానికి వేసవి తాపం సంబంధిత ఆరోగ్య సమస్యలకు త్వరగా మరియు సమర్థవంతంగా స్పందించడానికి వీలుగా శిక్షణ కల్పిస్తారు. దీనితో పాటు, వేడిగాలులతో సంబంధం ఉన్న ప్రమాదాల గురించి అవగాహన పెంచడానికి, వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడంపై ప్రజలకు ఆచరణాత్మక సలహాలను అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా సమాచార, విద్య, కమ్యూనికేషన్‌ (ఐఈసీ) ప్రచారం తీవ్రతరం చేస్తారు. తీవ్రమైన వేడి ప్రభావాన్ని తగ్గించడానికి సకాలంలో వైద్య సహాయం అందించడం, అవగాహన పెంచడం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, వనరులు అందుబాటులో ఉన్నాయని సమీక్ష సమావేశంలో అధికారులు హామీ ఇచ్చారు. వేడి సంబంధిత వ్యాధుల నోడల్‌ అధికారి డాక్టర్‌ బసంత్‌ ప్రధాన్‌, రాష్ట్ర నిఘా అధికారి డాక్టర్‌ అశోక్‌ పాయిక్రాయ్‌, నర్సింగ్‌ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ సెఫాలి మల్లిక్‌, డీఎఫ్‌డబ్ల్యూ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ ప్రతిభ ప్రధాన్‌, అన్ని జిల్లాల నుండి ప్రధాన జిల్లా వైద్య అధికారులు (సీడీఎంఓలు) వ్యక్తిగతంగా, వర్చువల్‌ మోడ్‌ ద్వారా ఈ సమావేశానికి హాజరయ్యారు.

క్లుప్తంగా

గోపాలచంద్ర శతపథికి రాష్ట్రపతి పురస్కారం



పర్లాకిమిడి: స్థానిక ముత్యాలమ్మ వీధిలో నివాసం ఉంటున్న విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు, రచయిత, కవి గోపాలచంద్ర శతపథి (75)కి వయోసర్వశ్రేష్ఠ సమ్మాన్–2021 అవార్డు న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో మే 2న అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. గోపాలచంద్ర శతపథి 2009లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సర్వీసులో ఉత్తమ ఉపాధ్యాయునిగా 1992లో రాష్ట్రపతి పురస్కారం అందుకున్నట్లు తెలియజేశారు. ఇప్పుడు వయో సర్వశ్రేష్ఠ సమ్మాన్ అవార్డు 2021 అందుకోనున్నట్లు తెలిపారు. అవార్డు దక్కడం పట్ల డీఈఓ మాయాధర్ సాహు, జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అభినందనలు తెలిపారు.

సెంచూరియన్ విద్యార్థులకు శిక్షణ

పర్లాకిమిడి: గుసాని సమితి ఉప్పలాడ రవీంద్ర నాథ్ ఠాగోర్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సెంచూరియన్ వర్సిటీ ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్లాంటేషన్ డేను నిర్వహించారు. అలాగే వ్యవసాయదారుల శిక్షణ శిబిరం కూడా పాఠశాలలో ఏర్పాటు చేశారు. వ్యవసాయంలో నూతన సేంద్రియ పద్ధతులను రైతులకు విద్యార్థులు తెలియజేశారు.

రమణమూర్తికి ఈఓగా పదోన్నతి

అరసవల్లి: అరసవల్లి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుప్పన్నగారి రమణమూర్తికి గ్రేడ్–3 ఈవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయనగరం పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి గతేడాది అరసవల్లి ఆలయానికి బదిలీపై రాగా.. తాజా పదోన్నతితో మళ్లీ విజయనగరంలో 6–సి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా మరో రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. ప్రస్తుతం అరసవల్లి ఆలయంలో అన్నదాన ప్రసాదాల సెక్షన్ ఇన్‌చార్జిగా ఉన్న ఈయనకు పదోన్నతి రావడంపై ఆలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

'ఆదిత్య'లో జాతీయ స్థాయి పోటీలు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా జాతీయ స్థాయి పోటీలు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఆలిండియా స్టూడెంట్స్ యూనియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్విజ్, డిజిటల్ పోస్టర్ మేకింగ్, వ్యాసరచన, స్లోగన్ రైటింగ్, అవేర్‌నెస్ రీల్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబానికి సాయం



పైడిరాజు కుటుంబానికి చెక్ అందజేస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డు పి.పైడిరాజు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి రూ.4.07 లక్షల నగదు చెక్కును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అందజేశారు. సహచర హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని ఈవిధంగా అందించారు.

నీలమణి దుర్గ ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణిదుర్గ అమ్మవారి 50వ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమపూజ, అష్టోత్తర శతనామ పూజ, హోమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, సుదీష్ణ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మే 7 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఈవో టి.వాసుదేవరావు చెప్పారు. పూజా కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ సన్యాసిరావు, బాబ్జీ, సతీష్, మద్దు రామారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఒడిశా గవర్నర్‌కు స్వాగతం

కంచిలి: మండలంలోని దాలేశ్వరం గ్రామంలోని సోలార్ ప్లాంట్ వద్దకు మంగళవారం విచ్చేసిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబుకు మండల అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ను కలిసి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, ఎంపీడీఓ వి.తిరుమలరావు, ఈఓపీఆర్‌డీ పి.ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి



తెలుగు సాంస్కృతిక సమితి, పాఠశాలల నిర్వాహక బృందం

- సిటీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో వక్తలు
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు

జయపురం/కొరాపుట్: తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నామని వక్తలు అన్నారు. జయపురం తెలుగు సాంస్కృతిక సమితి నిర్వహణలో కొనసాగుతున్న జయపురం సిటీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సోమవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి పది గంటల వరకు ఉత్సాహంగా కొనసాగింది. తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్ అధ్యతన జరిగిన కార్యక్రమంలో అతిథులకు ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్ కుమార్ పట్నాయక్ స్వాగతం పలికారు. తెలుగు సాంస్కృతిక సమితి అధ్యక్షులు బిరేష్ పట్నాయక్ మాట్లాడుతూ.. తెలుగు సాంస్కృతిక సమితి పెద్దల ఉద్యమంతో 1981లో తెలుగు బాలికల కోసం తెలుగు సాంస్కృతిక సమితి తెలుగు మాధ్యమ ఉన్నత పాఠశాలను నెలకొల్పిందని గుర్తు చేశారు. అనంతరం 2014లో ఆంగ్ల భాష మాధ్యమంలో కూడా ఉన్నత పాఠశాల ఏర్పాటు జరిగిందని వెల్లడించారు. సమాజంలో అట్టడుగు వర్గాల విద్యార్థులకు విద్య నేర్పేందుకు ఈ పాఠశాల ఏర్పడిందన్నారు. తెలుగు విద్యాబోధనలో సమతి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆనాటి సమితి నిర్వాహకులు అవదానం వలన పాఠశాల నెలకొందన్నారు. పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. అతిథులుగా సిటీ ఉన్నత పాఠశాల పరిశీలన కమిటీ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, తెలుగు సాంస్కృతిక సమితి కార్యదర్శి వై.శ్రీనివాస ఖన్నా, పాఠశాల వ్యవస్థాపక సభ్యులు శశిభూషణ పట్నాయక్, సిటీ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు బి.సుజాత, సిటీ ఎంఈ, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎం.మాధవి, సిటీ ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర పట్నాయక్ పాల్గొన్నారు. ఉత్తమ విద్యార్థులకు ప్రొఫెషనల్, భాస్కర అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద, సంబల్‌పురి, ఒడిస్సీ నృత్యాలు, తెలుగు సంప్రదాయ డ్యాన్స్‌లు ఆహూతులను అలరించాయి.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



సంబల్‌పురి నృత్యంతో అలరిస్తున్న విద్యార్థినులు



పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు



ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరిస్తూ..



తెలుగు సంప్రదాయ డ్యాన్స్ చేస్తున్న బాలికలు



ఒడిస్సీ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దిఘాలో జగన్నాథ ఆలయ ప్రతిష్టపై వ్యతిరేకత

భువనేశ్వర్: ప్రసిద్ధ పూరీ శ్రీ జగన్నాథ ఆలయానికి అద్భుతమైన ప్రతిరూపం పశ్చిమ బెంగాల్‌లోని దిఘా ప్రాంతంలో నిర్మితమైంది. ఈ జగన్నాథ ఆలయం బుధవారం ప్రారంభించనున్నారు. దీని నిర్మాణానికి రూ. 250 కోట్లు వెచ్చించారు. పవిత్ర అక్షయ తృతీయ సందర్భంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆలయాన్ని ప్రారంభిస్తారు. పశ్చిమ బెంగాల్ దిఘాలోని జగన్నాథ ఆలయంలో జరిగే ప్రతిష్ఠోత్సవంలో పాల్గొనవద్దని పూరీలోని సువార్ మహాసూర్ నియోగుల వర్గం నిర్ణయించింది. ఉల్లంఘించిన వారు బహిష్కరణకు గురవుతారని ఈ వర్గం హెచ్చరించింది. కొత్తగా ప్రారంభం కానున్న ఈ ఆలయంలో రాతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. దారు విగ్రహాల బదులుగా రాతి విగ్రహాలు ఎంచుకోవడం చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి శ్రీ మందిరం నుంచి అంతా దూరంగా ఉండాలని సూచించారు ఉల్లంఘనకు పాల్పడితే ఆలయం నుంచి బహిష్కరణ, స్వామి సేవల నుంచి శాశ్వతంగా తొలగింపు వంటి చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.









దిఘాలో ప్రారంభం కానున్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయ సముదాయం

గజపతిలో ఆరోగ్య సంక్షేమశాఖ కమిషన్ పర్యటన

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్‌లో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, కార్యదర్శి ఎస్.అస్వతీ మంగళవారం పర్యటించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, వర్కింగ్ వుమెన్స్ హాస్టళ్లను తనిఖీ చేపట్టారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఒడిశా జీవనోపాదుల శాఖ డి.పి.ఎం టిమోన్ బోరా, మోహనా బీడీఓ రాజీవ్ దాస్, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు ఉన్నారు.

మోహనా ప్రభుత్వ ఆస్పత్రిలో అందజేస్తున్న ఉచిత మందులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాతీయ హెల్త్ మిషన్ పథకాలు అమలుపై ఆరా తీశారు.



మోహనా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మందులను చెక్ చేస్తున్న కమిషనర్ అస్వతీ

నీలమ్మ ఉత్సవాలు ప్రారంభం

పర్లాకిమిడి: స్థానిక మెయిన్ మార్కెట్‌లో నీలమ్మ గ్రామదేవత ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభించారు. గజపతి కాయగూరల మార్కెట్ అసోసియేషన్ తరఫున ఒక్కరోజు కోసం అమ్మవారి పండుగ జరుపుకోవడం కోసం మూడు ఘటాలు తెచ్చి పలు వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం అనుపోత్సవం జరిపారు.



గజపతి కాయగూరల మార్కెట్‌లో అమ్మవారి ఘటాలు



నీలమ్మ గ్రామదేవత అనుపోత్సవంలో పాల్గొన్న మార్కెట్ కమిటీ సభ్యులు

నబరంగ్‌పూర్‌లో సినిమా చిత్రీకరణ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో దూరదర్శన్ వారు నిర్మిస్తున్న ఒడియా చలన చిత్రం ఖాలీ హండి నిర్మాణం పూర్తిచేసుకుంది. మంగళవారం జిల్లా కేంద్ర పరిసర గ్రామాల్లో ముగింపు షాట్‌లు చిత్రీకరించారు. ఒక అమాయక గిరిజనుడు సమాజంలో వివిధ సమస్యలతో పోరాడి తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడో ఈ చిత్రంలో చూపిస్తారు. గతంలో 6 దూరదర్శన్ చిత్రాలకి దర్శకత్వం వహించిన మనోజ్ కుమార్ పట్నాయక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. జిల్లాకి చెందిన స్థానిక కళాకారులు జితేంద్ర పరిచా, జితేంద్ర కుమార్ చౌదరి, ప్రకాష్ చంద్ర బారిక్, తదితరులు నటించారు. త్రిశక్తి కల్చరల్ అసోసియేషన్ ఈ సినిమాను నిర్మించింది.



నబరంగ్‌పూర్ ఖాలీ హండి చిత్ర నిర్మాణం జరుగుతున్న దృశ్యం



చిత్ర నిర్మాణ యూనిట్ సభ్యులు

చేయి చేయి కలిపి



పైపు లైన్ వేసేందుకు రహదారికి ఒకవైపు తవ్వుతున్న గ్రామస్తులు

రాయగడ:

అధికారులకు చెప్పి ఫలితం లేకపోవడంతో ఆ గ్రామస్తులే తమ సమస్యను పరిష్కరించుకున్నారు. సదరు సమితి పరిధిలో గల కారుబాయి పంచాయతీలోని నకపకగుడ గ్రామంలో 10 కుటుంబాలు నివసిస్తున్నాయి. అంతా ఆదివాసీలే. సుమారు 60 మందికి పైగా నివసిస్తున్న ఈ గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. ఇంతవరకు ప్రభుత్వం ఒక్క గొట్టపుబావిని కూడా ఇక్కడ ఏర్పాటు చేయలేదు. సమీపంలో గల వాగులో నుంచి వచ్చిన నీటినే గ్రామస్తులు తాగేందుకు వినియోగిస్తుండేవారు. తమ గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించండి మహాప్రభో అని ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం లేకపోయింది. వేసవి తీవ్రత ఎక్కువవ్వడంతో ఉన్న వాగు కూడా ఎండిపోయింది. దీంతో తాగేందుకు గుక్కెడు నీటి కోసం నానా అవస్థలు పడుతున్న గ్రామస్తులు అంతా కలిసి సమావేశమయ్యారు. తాగునీటి సమస్యను తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. పది కుటుంబాలకు చెందిన వారు రూ.50 వేలు పోగు చేసి 500 మీటర్ల దూరంలో గల ప్రభుత్వం సరఫరా చేస్తున్న పైపులైన్‌ను అనుసంధానించి గ్రామంలోకి తాగునీరు ఏర్పాటు చేసుకున్నారు.

53 యూనిట్ల రక్తం సేకరణ

జయపురం: ఉత్కళ గౌరవ్ మధుసూదన దాస్ జన్మదినం సందర్భంగా స్థానిక కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీ వారు నిర్వహించిన శిబిరాన్ని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ పరిశీలన కమిటీ అధ్యక్షులు ఈశ్వర చంద్రపాణిగ్రాహి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం అన్ని దానాలకంటే గొప్పదన్నారు. అర్హులందరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ అభయ పండ నేతృత్వంలో 53 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ సొసైటీ డిప్యూటీ రిజిస్ట్రార్ భీమసేన్ సాహు, కేసీసీ బ్యాంక్ సీనియర్ డైరెక్టర్ రమాకాంత రౌళో, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శిశిర దాస్, జయపురం సబ్‌డివిజన్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో అధికారులు

బంగారు బాలలు..

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రియ విద్యాలయంలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు ఇద్దరు భువనేశ్వర్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన కేంద్రీయ విద్యాలయం ప్రాంతీయ మార్షల్ ఆర్ట్స్‌లో గోల్డ్ మెడల్ సాధించినట్లు అకాడమీ కార్యదర్శి కార్తీక్ మహాపాత్రో మంగళవారం తెలిపారు. బెత్తగుడ వద్ద గజపతి కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు సువర్ణ సాహు, ప్రియాలీ రాణీ దాస్‌లు తైక్వాండ్ మార్షల్ ఆర్ట్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో అకాడమీ సభ్యులు, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.



గోల్డ్ మెడల్స్ అందుకున్న సువర్ణసాహు, ప్రియాలీ దాస్

లక్ష్మీపూర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన



గ్రామంలోకి ఆహ్వానిస్తున్న గిరిజనులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉల్క, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత పర్యటించారు. మంగళవారం సమితిలోని గౌడగుడ గ్రామ పంచాయతీ లక్ష్మణి గ్రామంలో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బలి జాతర ఏర్పట్లను పర్యవేక్షించారు. గ్రామ గిరిజనులతో సమావేశమై వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై చర్చించారు.

తాను అందుబాటులో లేనప్పుడు తన తరఫున ఎంపీ ప్రతినిధి ఈ ప్రాంతంలో ఉంటారని, ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. అంతకు ముందు గ్రామ సరిహద్దులలో గిరిజన యువతులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. గ్రామ దేవతకు ఎంపీ, ఎమ్మెల్యే పూజలు చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన

జయపురం: మహిళా చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని వక్తలు అన్నారు. వర్కింగ్ మహిళల వేధింపు, ఎస్టీ, ఎస్సీ అత్యాచార చట్టం 1989పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు న్యాయ చైతన్య శిబిరాన్ని గోపాలకృష్ణ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గౌరహరి విహార్, రాణిపుట్‌లో జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం నిర్వహించిన సచేతన శిబిరాన్ని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం అధ్యక్షులు ప్రదీప్ కుమార్ మహంతి పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లోక్ అదాలత్ శాశ్వత విచారపతి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో ఉద్యోగాలు పొందిన మహిళలపై శారీరిక వేధింపుల నియంత్రణకు, అభ్యంతర అభియోగ కమిటీ ఏర్పాటు జరుగుతుందని మహిళలకు రక్షణ కల్పించే చట్టాలపైన, సోస్కో చట్టాలపై వివరించారు. గోపాల కృష్ణ ఇంజినీరింగ్, టెక్నాలజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు



మాట్లాడుతున్న సుమన్ జెన

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ.ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఏటీఎల్ సమ్మర్ బూట్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఈఓ మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: వచ్చే నెల 1 నుంచి 3వ తేదీవరకు ధర్మవరం ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించనున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) బూట్ క్యాంప్ పోస్టర్‌ను డీఈఓ యూ.మాణిక్యానాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యాంప్‌లో అందించే శిక్షణ వివరాలపై జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాంపులో విద్యార్థులకు డిజైనింగ్, క్రిటికల్ థింకింగ్, డ్రోన్ టెక్నాలజీ, 3డీ ప్రింటింగ్ టెక్నాలజీ, ఆర్డినోకోడింగ్, రోబోటిక్ ఆటోమేషన్ టెక్నాలజీలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీప్యూటీ ఈఓ కె.వెంకటరమణ, హబ్ ఏటీఎల్ ఇన్‌చార్జ్ వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మిమ్స్ డ్రైవర్ మృతి

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలో పాత రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని, మిమ్స్ డ్రైవర్ మృతి చెందాడు. మిమ్స్ ఆస్పత్రిలో డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.సూర్యనారాయణ(45) మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇక్కడి ట్రాక్ దాటుతుండగా విజయనగరం వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక అమ్మాయి ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


అత్యుత్సాహమేనా..?


మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఎమ్మెల్యే విజయచంద్ర ఫొటో

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ కార్యాలయంలో మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోలతో పాటూ సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు పెట్టుకోవడంలో తప్పులేదు. అయితే పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం కమిషనర్ చాంబర్‌లో మాత్రం ఎమ్మెల్యే ఫొటోను పెట్టి అధికారి అయి ఉండి అత్యుత్సాహం చూపుతున్నారా..? అభిమానం చూపుతున్నారా అని ఉద్యోగులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఎమ్మెల్యే వద్ద సానుభూతి పొందేందుకే ఇలా చేస్తున్నారని ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ప్రయోజనకరం

- జేసీ సేతు మాధవన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో అనేక విధాలుగా ప్రయోజనం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం డ్రోన్ టెక్నాలజీపై జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాంకేతిక పెరుగుతోందన్నారు. వ్యవసాయ ఉత్పాదకతను మెరుగుపరచడంలో ఖర్చులను తగ్గించడంలో సమర్థతను పెంచడంలో డ్రోన్ల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అభిప్రాయపడ్డారు. కిసాన్ డ్రోన్ ఎఫ్ఎంబీ గ్రూపుల ఖాతాల ప్రారంభం, రుణమంజూరుకు సంబంధించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

సంగీత సాహిత్య సమలంకృతే..!


సంగీత సరస్వతి

గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వర రావు, గానకోకిల పి.సుశీల, సంగీత చక్రవర్తి సాలూరు రాజేశ్వర రావు, నేదునూరి కృష్ణమూర్తి వంటి దిగ్గజాలను సంగీత ప్రపంచానికి పరిచయం చేసింది విజయనగరంలోని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల. విజయనగరం పేరు చెప్పగానే ఠక్కున గుర్తుకొచ్చేది ఇక్కడి సంగీత కళాశాల. ఎందరో మహానుభావులు ఇక్కడి కళాశాలలో విద్యనభ్యసించి దేశవిదేశాల్లో ప్రతిభ కనబరిచి కళాశాల ప్రతిభను ఇనుమడింప జేశారు. నాడు గజపతి రాజులు నాటిన కళాశాల అనే చిన్న బీజం నేడు వటవృక్షంలా ఎదిగి ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది. శతాబ్దం క్రితం ప్రారంభమైన సంగీత కళాశాల నేడు 106వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ సందర్భంగా సంగీత కళాశాలు పుట్టుపూర్వోత్తరాలను తెలుసుకుందాం.


మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల

- 106 ఏళ్ల పండగకు సర్వం సిద్ధం
- సంగీత కళాశాల తొలి అధ్యక్షుడిగా ఆదిభట్ల
- ఉత్సవానికి తరలిరావాలని ప్రిన్సిపాల్ పిలుపు
- నేడు మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల 106వ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: సంగీత సరస్వతి 106వ వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమవుతోంది. సంగీతానికి అధిక ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో విజయనగర రాజులు 1919 ఫిబ్రవరి 5న సంగీత కళాశాలకు అంకురార్పణ చేశారు. ఎందరో మేధావులు, మహానుభావులు కళాశాలలో విద్యనేర్చుకుని ప్రపంచ దేశాల్లో వారి ప్రతిభను ప్రదర్శించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. కళామతల్లి ఒడిలో స్వరాలు నేర్చుకున్న ఎందరో గానగంధర్వులు కలియదిరిగిన సంగీత సరస్వతికి వైఎస్‌ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు 2023లోనే వరించింది. 106వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.


ఘంటసాల నిద్రించిన కళాశాలలో ఉన్న ఏనుగు శాల


ఎందరో విద్యార్థులు ఈ చెట్టు నీడనే సాధన చేసేవారు

1953లో ప్రభుత్వ ఆధీనంలోకి..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1953లో కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుంది. నాటి నుంచి మహారాజా ప్రభుత్వ సంగీత, నత్యకళాశాలగా రూపాంతరం చెందింది. అప్పుడు కేవలం ఐదు విభాగాలు గాత్రం, వీణ, వయోలిన్, మదంగం, భరతనాట్యం విభాగాలతో ప్రారంభమైంది. తర్వాత స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో కొంతకాలం కొనసాగి, ప్రస్తుతం 1980 నుంచి కల్చరల్ ఎఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లో కొనసాగుతోంది.

సంగీతాభిమానులందరూ తరలిరండి



కళాశాల 106వ వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకం. కళాశాల అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్న వారందరికీ అభినందనలు. ఎందరో మహానుభావులు నడయాడిన ప్రాంతమిది. కళాశాలలో పరికరాల మరమ్మతులకు రూ.2.50 లక్షలు ఎమ్మెల్యే అందజేశారు. – కేవీఎల్ఎస్.శాస్త్రి, ప్రిన్సిపాల్, ఎఫ్ఏసీ, మహారాజా సంగీత, నృత్యకళాశాల, విజయనగరం

తొలి అధ్యక్షుడిగా ఆదిభట్ల

పూసపాటి విజయరామ గజపతులు విజయనగరంలో 1919 ఫిబ్రవరి 5వ తేదీన విజయరామ గాన పాఠశాల (నేటి సంగీత , నత్యకళాశాల)ను ప్రారంభించారు. కోటకు వెనుకవైపు గల ఇప్పటి టౌన్‌హాల్‌ను ఇందుకోసం కేటాయించారు. సువిశాలమైన ఈ భవనంలోనే సంగీత కళాశాలను నిర్వ హిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే ప్రప్రథమంగా నెలకొల్పిన సంగీత కళాశాలకు బహుముఖ ప్రజ్ఞాశాలి, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. పద్మశ్రీ డాక్టర్ ద్వారం వెంకటస్వామినాయుడిని వయోలిన్ ప్రొఫెసర్‌గా నియమించి సంస్థను ప్రారంభించారు. ఆదిభట్ల పదవీ విరమణ చేయడంతో ద్వారం వెంకటస్వామినాయుడు అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి, కళాశాలను అభివృద్ధి పథంలో నడిపించారు. విజయరామ గజపతుల తర్వాత అలక్ నారాయణ్ గజపతులు, పీవీజీ రాజుల హయాంలో కళాశాల పూర్తి హంగులతో రూపుదిద్దుకుంది. ప్రపంచంలో మహా విద్వాంసులు పదివేలమందికి పైగా ఇక్కడ విద్యాభ్యాసం చేశారు. వారిలో నేదునూరి కృష్ణమూర్తి, ఘంటసాల వెంకటేశ్వర రావు, పి.సుశీల, సాలూరు రాజేశ్వరరావు, చిన సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కళాశాలలో ప్రస్తుతం అందిస్తున్న కోర్సులు

కళాశాలలో ఏడు విభాగాల్లో కోర్సులందిస్తున్నారు. గాత్రం, వయొలిన్, వీణ, మదంగం, డోలు, నాదస్వరం, భరతనాట్యంలో కోర్సులను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. వాటితో పాటూ తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రెగ్యులర్ కోర్సులు, సర్టిఫికెట్ డిప్లమో కోర్సులను నిర్వహిస్తున్నారు. బీఏ.మ్యూజిక్, నాలుగేళ్లు, ఎంఏ మ్యూజిక్, పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థులు ఇక్కడ 11 మంది వరకూ ఉన్నారు. సాయంత్రం వేళ ఏడాది కాల వ్యవధిలో లలిత సంగీతం, హరికథ, డోలు విభాగాల్లో కోర్సులు ఉన్నాయి.

ఇప్పటివరకూ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వారు

1919 ఫిబ్రవరి 5న మహారాజా విజయరామగజపతి రాజు వ్యవస్థాపక అధ్యక్షుడిగా హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు మొదటి ప్రిన్సిపాల్‌గా 1919 నుంచి 1936 వరకూ పనిచేశారు. అనంతరం సంగీత కళానిధి, సంగీత రత్నాకర, పద్మశ్రీ డాక్టర్ ద్వారం వెంకటస్వామినాయుడు 1936నుంచి 1953 వరకూ పనిచేశారు. ఆయన తర్వాత సంగీత కళాభూషణ ద్వారం నరసింగరావు 1953 నుంచి 1960 వరకూ, సంగీత కళాప్రపూర్ణ ద్వారం భావ నారాయణరావు 1962 నుంచి 1973 వరకూ, సంగీత చూడామణి నేదునూరి కష్ణమూర్తి 1977 నుంచి1979 వరకూ అనంతరం కుమారి శ్రీరంగం గోపాలరత్నం 1979 నుంచి 1980 వరకూ పనిచేశారు. అనంతరం ద్వారం దుర్గాప్రసాదరావు 1982 నుంచి 2000 వరకూ పనిచేశారు. వారి తర్వాత పీవీఎస్.శేషయ్య శాస్త్రి 2000 నుంచి 2006 వరకూ పనిచేశారు. తర్వాత బురిడి అనూరాధా పరశురామ్ పనిచేసి పదవీవిరమణ చేశారు. ఆమె తర్వాత ఆర్‌వీ. ప్రసన్నకుమారి ప్రిన్సిపాల్‌గా పనిచేసి 2023 ఫిబ్రవరి 28న అకాల మరణం పొందారు. ఆమె తర్వాత ప్రస్తుతం ఇన్చార్జ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేవీఎల్ ఎన్.శాస్త్రి వ్యవహరిస్తున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- వచ్చే నెల 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి


ప్రభుత్వ ఐటీఐ విజయనగరం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ విద్యాలయాల్లో ఆగస్టు–2025 సెషన్‌కు సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్ టీవీగిరి మంగళవారం ప్రకటించారు. అర్హులైన అభ్యర్థులు తొలుత 'ఐటీఐ.ఏపీ.జీటీవీ.ఐఎన్' వెబ్ సైట్ ద్వారా నేరుగా సదరు వెబ్‌సైట్‌లో సూచనల ప్రకారం మే 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ప్రాసెస్ అయిన తరువాత వచ్చిన యూనిక్ నంబర్‌తో మే 26వ తేదీ వరకు దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐకి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని వెళ్లి వెరిఫికేషన్ ప్రాసెస్ చేయించుకోవాలి. అభ్యర్థి ఏ జిల్లాలో అయినా దరఖాస్తు పెట్టుకోవడానికి ఆప్షన్ ఉంది. లాగిన్‌లో ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ నంబర్ టైప్ చేయగానే అభ్యర్థి వివరాలను చూపిస్తుంది. దరఖాస్తు సబ్మిట్ చేసిన వెంటనే, జనరేట్ అయ్యే యూనిక్ నంబర్‌తో కూడిన ప్రింటవుట్‌తో ఏదైనా జిల్లాలో గల ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను అభ్యర్థులు వెరిఫికేషన్ చేయించుకోవాలి. వెరిఫికేషన్ చేయించుకున్నవారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులవుతారు. వెల్డర్, ప్లంబర్‌లకు 8వ తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. మిగతా అన్ని ట్రేడ్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి 10వ తరగతి పాసై ఉండాలని అభ్యర్థులు గమనించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రిజిస్ట్రేషన్ సమయంలో గమనించాల్సిన అంశాలు

- అభ్యర్థి ఆధార్ అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో మాత్రమే ఐటీఐ వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- ఒకసారి అడ్మిషన్ పొందిన అభ్యర్థి అదే మొబైల్ నంబర్‌ను స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ నంబర్ జనరేట్ అయ్యేంత వరకు అభ్యర్థి వద్దే ఉండాలి.
- అభ్యర్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, జెండర్ పదవ తరగతి సర్టిఫికెట్ ఆధార్ కార్డులో ఒకే విధంగా ఉండాలి.
- పూర్తి వివరాల కోసం ఫోన్ 9849118075, 9849944654, 7780658035 నంబర్లలో సంప్రదించాలి.

తోటపల్లి కాలువగట్లపై కంకర తవ్వకాలు


పిరిడిలో తోటపల్లి కాలువవద్ద ఎడమవైపు చదునుచేసిన గట్లు


కుడివైపు జరిగిన కంకర తవ్వకాలు

బొబ్బిలి రూరల్: అక్రమ సంపాదనకు అలవాటు పడిన కంకర దొంగలు తోటపల్లి కాలువ గట్లపై ఉండే కంకరకుప్పలపై కన్నేశారు. ఈ నేపథ్యంలో శని, ఆదివారాల్లో ఇష్టానుసారం గట్లను తవ్వేసి సొమ్ము చేసుకున్నారు. మరో వైపు గట్లను చదును చేస్తూ ఆక్రమణలకు పూనుకుంటున్నారు. మండలంలోని పిరిడి గ్రామం వద్ద నున్న తోటపల్లి కాలువకు ఇరువైపులా కంకర గట్లను తవ్వి కంకరను తరలించుకుపోతున్నారు. కాలువ నిర్మాణానికి రైతుల నుంచి భూసమీకరణ చేయగా ప్రభుత్వం వారందరికీ నష్టపరిహారం చెల్లించింది. కానీ కొంతమంది కంకరను తవ్వి ఆ భూములను ఆక్రమించే పనిలోపడ్డారు. గ్రామానికి కూతవేటు దూరంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువ వెళ్తుంది. గతంలో కాలువ నిర్మాణానికి అక్కడ కాలువ పొడవునా తవ్విన కంకర, మట్టిని అక్కడే పోగు చేసి కుప్పలుగా వేశారు. దీనిపై కన్నేసిన కంకర దొంగలు రాత్రిళ్లు పెద్ద ఎత్తున కంకరను తవ్వి తరలించుకుపోతున్నారు. దీనిపై అటు నీటిపారుదలశాఖ, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలువ వెంబడి ఉన్న అనేక చోట్ల కంకరను తవ్వి తోలుకుపోగా ఉన్నదాన్నైనా కాపాడేందుకు, ఆక్రమణకు గురికాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వ్యాన్ బోల్తా: పలువురికి గాయాలు


వ్యాన్ బోల్తా పడి చెల్లాచెదురైన మొక్కజొన్న

గజపతినగరం: మండలకేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో జాతీయ రహదారి వద్ద వ్యాన్ బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలలోకి వెళ్తే.. బొబ్బిలి నుంచి విజయనగరం మొక్కజొన్న లోడుతో ప్రయాణిస్తున్న వ్యాన్ గజపతినగరం మండల కేంద్రంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆ వ్యాన్‌లో పద్మనాభం మండలం అయినాడకు చెందిన ఎం.రాము, జి.శివ, డి.మురళీకృష్ణ, బి.సాయిలకు గాయాలయ్యాయి. వారిలో రాము పరిస్థితి విషమంగా ఉండడంతో హుటాహుటిన విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మిగతావారికి గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు అందజేసి బుధవారం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు

- విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం
- క్రమేపీ సారం కోల్పోతున్న భూమి
- జిల్లాలో 28,425 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం
- ఇప్పటివరకు 17,373 నమూనాల సేకరణ


గుంపాంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ అధికారుల బృందం

పూసపాటిరేగ: వ్యవసాయ సాగులో ఇష్టానుసారం రసాయన ఎరువులు వినియోగించడంతో భూములు సారం కోల్పోయి చౌడుభూములుగా మారుతున్నాయి. భూములు సారం కోల్పోవడంతో పంట దిగుబడులు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలుసుకోకుండా ఎరువులు వేసినా ఆశించిన ఫలితం ఉండదు. భూమి ఆరోగ్యం తగిన పోషకాలతో ఉన్నప్పుడే సత్ఫలితాలు సాధ్యం. ఎంత మోతాదులో ఎరువులు వేయాలో తెలుసుకోవాలన్నా భూసార పరీక్షలు తప్పనిసరి. భూసార పరీక్షల నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటే వ్యయభారాన్ని రైతులు తగ్గించుకోవచ్చు. పంటల్లో అధిక దిగుబడులు వచ్చినట్లయితే రైతులు ఆనందంగా ఉండవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. దిగుబడి ఎక్కువ రావాలంటే ఏం చేయాలి, పెట్టుబడి ఎలా తగ్గించుకోవాలి అనే విషయాలపై రైతులు అవగాహన చేసుకోవాలి. నేలను ఆరోగ్యవంతంగా ఉంచడం, భూమిలో ఉన్న పోషకాలు, ఏ పంట సాగు చేయాలి, ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే అంశాలను రైతులు తెలుసుకోవాలని చెబుతున్నారు. ఖరీఫ్ సాగును దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు మట్టి నమూనాల సేకరణలో నిమగ్నమై ఉన్నారు. జిల్లాలో 28,425 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా నేటివరకు 17,373 మట్టి నమూనాల సేకరణ జరిగింది, నెలిమర్ల నియోజకవర్గంలో 3450 మట్టి నమూనాల సేకరణను లక్ష్యంగా పెట్టుకుని 2438 వరకు సేకరించారు. కమతాల మధ్యలో 15 సెంటీమీటర్ల లోతులో గుంత తవ్వి మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. ప్రతి ఆరున్నర ఎకరాలుకు ఒక నమూనా తీసుకుంటున్నారు. ఎనిమిది లేదా పదిచోట్ల సేకరించిన మట్టిని ఒక గోనె సంచిపై వేసి కలుపుతారు. దానిని నాలుగు భాగాలుగా చేసి ఎదురెదురుగా ఉన్న భాగాలను కలిపి అందులో అరకిలో చొప్పున మట్టిని సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపుతారు. అనంతరం భూసార పరీక్షలు ఫలితాల కార్డులను రైతులకు అందజేస్తారు. జీపీఎస్ ఆధారంగా సేకరించిన చిత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి ఫలితాల స్వభావాన్ని రైతుల సెల్‌ఫోన్‌కు తెలుగులో పంపిస్తారు.

రైతులకు అవగాహన

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.భూసార పరీక్షలు ఫలితాలను బట్టి రైతులు ఏ పంటలు వేసుకోవాలో తెలియజేస్తున్నాం. సాగుకు ఎంత మోతాదులో ఎరువులు వేసుకోవాలి. ఫలితాలు ఎలా వస్తాయే అంశాలను వివరిస్తున్నాం. – హరికృష్ణ, మండల వ్యవసాయ అధికారి భోగాపురం

ప్రారంభమైన నమూనాల సేకరణ

జూన్ నుంచి ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలోగానే మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు అందించాలని వ్యవసాయ శాఖ అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, బాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులు గుర్తించవచ్చు. ఫలితాలు వచ్చిన తరువాత భూమిలో ఏ సూక్ష్మధాతువుల లోపం ఉందో తెలుసుకుని రైతులు ఎరువులు వినియోగించాలని, లేకుంటే నేల సారం కోల్పోయి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) పరిధిలోని ప్రభుత్వాస్పత్రుల్లో 29 ఉద్యోగాలకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలుంటే మే నెల 3వ తేదీలోగా డీసీహెచ్ఎస్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు.

బాల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో 32 బాలల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, వీటిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐదు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 27 కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి దరఖాస్తులు అందినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. జువైనల్ జస్టిస్ యాక్ట్–2015 ప్రకారం కేంద్రాల ఏర్పాటుకు డీపీఓ కన్వీనర్‌గా ఉన్న ఇన్‌స్పెక్షన్ కమిటీ సిఫార్సు చేసిందన్నారు. వాటిని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, ఏఎస్పీ సౌమ్యలత, ఐడీసీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్


సమీక్షిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వివిధస్థాయిల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశించారు. లబ్ధిదారులు సంతృప్తిచెందే విధంగా ఈ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగానే సమస్యలకు పరిష్కారం చూపించాలని స్పష్టం చేశారు. మంత్రుల కార్యాలయాలకు జిల్లా నుంచి అందిన దరఖాస్తులపై కలెక్టర్ తమ కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. మొత్తం 10 వినతులను ఈ సందర్భంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులను తన చాంబర్‌కు రప్పించి, వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వారి దగ్గరున్న సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఆ ఫిర్యాదులకు సంబంధించి రెవెన్యూ అధికారులపై ఈ సందర్భంగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి అక్కడికక్కడే పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళి, డ్వామా పీడీ శారదాదేవి, సహకార అధికారి రమేష్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ ఆశయ్య, ఆర్‌డీఓ కీర్తి, తహసిల్దార్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జామి పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ


జామి స్టేషన్‌లో సీడీ ఫైల్స్ తనిఖీ చేస్తున్న ఎస్పీ వకుల్‌జిందల్

విజయనగరం క్రైమ్: వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ వకుల్‌జిందల్ విజయనగరం సబ్ డివిజన్ పరిధి జామి పీఎస్‌ను మంగళవారం సందర్శించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం సీడీ ఫైల్స్, జనరల్ డైరీ, సెంట్రీ, బీట్ బుక్‌లను ఎస్పీ తనిఖీ చేశారు. తొలుత రిసెప్షన్ కౌంటర్‌ను ముందుగా తనిఖీ చేసి ఆర్‌సీలో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల సమయాన్ని స్టేషన్‌హౌస్ ఆఫీసర్ జనార్దన్‌ను అడిగారు. స్టేషన్ మొత్తం పరిశీలించి సీసీ కెమెరాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఎక్కువగా సీసీ కెమెరాల ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలని, అందుకు తగిన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. గ్రామ సందర్శన తరచూ చేయాలని పీస్ కమిటీలతో సమావేశం కావాలని చెప్పారు. తనిఖీల్లో విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్, ఎస్.కోట సీఐ అప్పలనాయుడు, జామి ఎస్సై వీర జనార్దన్, ఎస్బీ సీఐ లీలారావు ఉన్నారు.